సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 1 । నవంబర్ । 2023



జాతీయ సమైక్యత అందరి బాధ్యత

జాతీయ సమైక్యతను కాపాడడం అందరి బాధ్యత అని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. 8లో



మోదమ్మకు కంఠాభరణం

మాడుగుల మండలం కేజేపురంలో మోదమ్మకు హరినాథ్ దంపతులు అర కిలో వెండి కంఠాభరణాన్ని సమర్పించాడు.



ఘనంగా నిత్యకల్యాణం

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.

రేపు విశాఖకు సీఎం జగన్



మహారాణిపేట (విశాఖ): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గురువారం విశాఖ వస్తున్నారు. ఉదయం 7.35 గంటలకు సీఎం నివాసం నుంచి గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరుతారు. 8.50 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో 9.15 గంటలకు మధురవాడ ఐటీ హిల్‌కు చేరుకుంటారు. 9.20 గంటలకు రోడ్డు మార్గం ద్వారా రుషికొండ రాడిసన్ బ్లూ రిసార్ట్‌కు బయలుదేరుతారు. 9.30 గంటల నుంచి 11 గంటల వరకు 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ ప్లీనరీలో (ఐసీఐడీ) పాల్గొంటారు. 11.05 గంటలకు రాడిసన్ బ్లూ రిసార్ట్ నుంచి బయలు దేరి మధురవాడ హెలిపాడ్‌కు చేరుకుంటారు. 11.35 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. 11.45 గంటలకు విమానంలో తిరుగు పయనమవుతారు.

న్యూస్‌రీల్

3న అనంతగిరిలో జగనన్నకు చెబుదాం

అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 3 వతేదీన స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శ్రీహర్షిత్ తెలిపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, తదితరులు పాల్గొని గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గాయపడిన బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: వ్యాన్ బోల్తాపడిన ప్రమాదంలో గాయపడిన బాధితులను మంగళవారం పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శించారు. మండలంలోని బలపం పంచాయితీకి చెందిన కృపారావు, మత్స్యలింగం కొక్కిరాపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో గాయపడిన వీరిని ఎమ్మెల్యే పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. మెరుగైన వైద్య అందించాలని వైద్యులను కోరారు. ఆమె వెంట ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు అరకు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, కోచ్

అరకులోయ టౌన్: స్థానిక ఏపీ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, బ్యాడ్మింటన్ కోచ్ కె.రాజబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగే పోటీలు అండర్ 17 విభాగంలో వి. అజిత్ కుమార్, అండర్ 15 విభాగంలో కె. ఆదిత్య, పి. చంద్రశేఖర్ పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

ఏడు నుంచి సత్య దీక్ష

- గిరిజన భక్తులకు దీక్షా వస్త్రాల పంపిణీ



సత్య దీక్ష వస్త్రాలను అందజేస్తున్న అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యురాలు పోచమ్మ

అడ్డతీగల: ఈ నెల ఏడు నుంచి అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సత్య దీక్ష చేపట్టనున్న గిరిజన భక్తులకు దేవస్థానం తరపున దీక్షా వస్త్రాలు ఉచితంగా అందజేస్తున్నట్టు పాలకమండలి సభ్యురాలు కారుకోడి పోచమ్మ తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక పవనగిరి క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాలకు చెందిన 700 మందికి దీక్షా వస్త్రాలు అందజేస్తున్నామని తెలిపారు. పీఆర్వో లక్ష్మీనారాయణ, పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య పాల్గొన్నారు.

రైతులకు వెన్నుదన్నుగా..



విరగ్గాసిన ధాన్యం కంకులు



వెన్నులతో రాగుల పంట

గిరి సంక్షేమమే ధ్యేయంగా సహకారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వరి, రాగుల రైతులకు మార్కెటింగ్ సమస్య తలెత్తకుండా కార్యాచరణ రూపొందిస్తోంది. దళారుల బారిన పడి మోసపోకుండా ఉండేలా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలుకు నిర్ణయించింది. మద్దతు ధర కూడా ప్రకటించింది.

- వరి, రాగుల సాగుకు ప్రోత్సాహం
- మద్దతు ధర ప్రకటించిన ప్రభుత్వం
- క్వింటా గ్రేడ్ వన్ ధాన్యం రూ.2,203,
- సాధారణ రకం రూ.2,183
- రాగులు రూ.3846 కొనుగోలుకు నిర్ణయం

సాక్షి,పాడేరు: మన్యంలో గిరి రైతులు సాగు చేస్తున్న వరి, రాగుల పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. వీటిని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలుకు పౌరసరఫరాల విభాగం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం..

పౌరసరఫరాల విభాగం అధికారులు గతేడాది



గతేడాది రంపచోడవరం ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లు

28,520 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని గిరి రైతుల నుంచి కొనుగోలు చేశారు. అయితే ఈ ఏడాది కొనుగోలు లక్ష్యం పెంచారు. జిల్లాలో ఈ ఏడాది 50,430 హెక్టార్లలో వరి సాగవుతుండగా 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 46 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈనెలాఖరు నుంచి లేదా డిసెంబర్ మొదటి వారంలో కొనుగోలు చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు.

మూడు వేల టన్నుల రాగులు..

జిల్లాలో రాగులను కూడా ఈఏడాది కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. గతేడాది సాంకేతిక కారణాలతో రాగుల కొనుగోలు చేపట్టలేదు. ఈ జిల్లాలో 16,421 హెక్టార్లలో రాగులు సాగు చేపట్టారు. అయితే పాడేరు డివిజన్‌లో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. 20 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ నెలాఖరు నుంచి కొనుగోలు చేసేందుకు పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు మూడు వేల టన్నుల కొనుగోలు లక్ష్యంతో ఉన్నట్టు పేర్కొంది.

ధరలిలా..

ప్రభుత్వం ధాన్యం,రాగులకు మద్దతు ధరను ప్రకటించింది. ధాన్యం గ్రేడ్ వన్ 100 కిలోలు రూ.2,203, సాధారణ రకం రూ.2,183, రాగులు 100 కిలోలు రూ.3846 చొప్పున కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం, రాగుల కొనుగోలుపై విస్తృత ప్రచారం చేయడంతోపాటు, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలను రైతులకు వివరించే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకులు సిద్ధమవుతున్నారు.

పారదర్శకంగా కొనుగోళ్లు



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ధాన్యం,రాగులను పారదర్శకంగా కొనుగోలు చేస్తాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలపై విస్తృత ప్రచారం చేస్తాం. ఎంపిక చేసిన రైతు భరోసా కేంద్రాలల్లోనే ధాన్యం ,రాగులను అమ్ముకోవాలి. దళారులు, వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుని మోసపోవద్దు.

– జె.శివశ్రీనివాస్, జాయింట్ కలెక్టర్, పాడేరు

మిరియం రైతులకు మార్కెటింగ్ సౌకర్యం

ఐటీడీఏ పీవో అభిషేక్



స్పైసెస్ బోర్డు అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : ఏజెన్సీలో గిరిజన రైతులు సేకరిస్తున్న మిరియాల పంటకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ తెలిపారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో రీజనల్ లోకల్ ప్రాజెక్టు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరియాలకు కూడా కాఫీ మాదిరిగానే శుద్ధీకరణ చేసి అదనపు విలువలు జోడించి విక్రయిస్తే గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. వీడీవీకేల ద్వారా మిరియాల శుద్ధీకరణ చేపడుతామన్నారు. ఏజెన్సీలో మిరియాల దిగుబడిపై అంచనాలు తయారు చేయాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. స్పైసెస్ బోర్డు సంచాలకులు ధర్మేంద్ర దాస్ వర్చువల్ విధానంలో మాట్లాడారు. స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో అర్హులైన మిరియం రైతులకు శుద్ధీకరణ యంత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆహార, వ్యవసాయ సంస్థ నేషనల్ ప్రాజెక్టు మేనేజర్ వినయ్‌సింగ్, సహాయ సంచాలకుడు వి. విజేష్న వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. స్పైసెస్ బోర్డు సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బి. కళ్యాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ. రమేష్‌కుమార్ రావు, పీహెచ్‌వో అశోక్, ఏపీఎం ఐపీ డీఎం ఎంఏ రహీం, జెడ్‌బీఎన్ఎఫ్ డీపీఎం భాస్కర్‌రావు, మోదాపల్లి రైతులు, కొనుగోలు, ఎగుమతిదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాఫీ పండ్ల కొనుగోలు

- మాక్స్ సొసైటీ అధ్యక్షుడు సెగ్గి కొండలరావు



చింతపల్లి రూరల్: ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం నుంచి కాఫీ మాక్స్ సంస్థ ద్వారా గిరి రైతుల నుంచి కాఫీ పండ్లు కొనుగోలు చేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు సెగ్గి కొండలరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాడేరు ప్రాజెక్టు అధికారి అభిషేక్ కాఫీ పండ్లు కిలో రూ.43 ధర నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. కాఫీ పండ్లు విక్రయించిన రైతులకు 3,4 రోజుల్లో వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గాము సింహాచలం, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి పాడేరు: జిల్లాలో కాలుష్యం, వ్యర్థాల నియంత్రణపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన పర్యావరణ పర్యవేక్షక జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో పలు సూచనలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో అటవీ, వైద్య, పంచాయతీ రాజ్, గనులు, గ్రామీణ నీటి సరఫరా, కాలుష్య నియంత్రణ, పోలీసు, రవాణా శాఖలు కీలకమన్నారు. కాలుష్య నియంత్రణతో పర్యావరణ పరిరక్షణకు ఆయా శాఖలు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేక్ హోల్డర్స్‌తో సమావేశాలు నిర్వహించి గ్రామ, మండల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. తరచూ సమావేశాలు నిర్వహించి చైతన్యం తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్లాస్టిక్ నిర్వహణ, రీసైక్లింగ్, పారిశుధ్య నిర్వహణ, కాలుష్య నియంత్రణలపై పాడేరు, రంపచోడవరంలో వర్క్ షాపులు నిర్వహించి అవసరమైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. వాయు, జల, ధ్వని వాతావరణ కాలుష్యాలు క్రమేపీ తగ్గించాలని కోరారు. ధ్వని కాలుష్యం తగ్గించేందుకు లారీ ఓనర్ల సంఘంతో సమావేశం నిర్వహించి తగు సూచనలు చేయాలని ఆర్టీవో లీలాప్రసాద్‌ను ఆదేశించారు. నీటి కాలుష్యం తగ్గించడానికి తగు చర్యలు తీసుకోవాలని, ప్రకృతి సిద్ధంగా ప్రవహిస్తున్న వాగులు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగే ఇసుక, గనుల తవ్వకాలపై దృష్టి సారించాలని మైన్స్ ఏడీ జాన్‌ను ఆదేశించారు. మెడికల్ వ్యర్థాలను ప్రత్యేక రీతిలో సైక్లింగ్ చేసి ఎటువంటి కాలుష్యం లేకుండా, హాని కలుగకుండా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య అధికారులను ఆదేశించారు. మెడికల్ వ్యర్థాలను కేటగిరీల వారీగా వేరే చేసేలా సిబ్బందికి తగు సూచనల్విఆలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషాను ఆదేశించారు.చెత్తను తరలించే ట్రాక్టర్ రాక ఆస్పత్రిలో ఆహార వ్యర్థాలు రోజుల తరబడి నిల్వ ఉన్నందున ఇబ్బందులు పడుతున్నామని డీసీహెచ్ కృష్ణారావు కలెక్టర్ దృషికి తీసుకువచ్చారు. ఇందుకు ప్రత్యేకంగా ట్రాక్టర్ కేటాయించాలని డీపీవో కొండలరావును ఆదేశించారు.

ఘనంగా పొల్లూరు ధారాలమ్మ జాతర



పొల్లూరు గ్రామం నుంచి కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

మోతుగూడెం: పొల్లూరు గ్రామ దేవత ధారాలమ్మ తల్లి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగ పురస్కరించుకొని భారీస్థాయిలో అన్నసమారాధన నిర్వహించారు. పొల్లూరుకు చెందిన ఎం. శివరామకృష్ణ, రమణ కుటుంబ కుటుంబ సభ్యులు అమ్మవారికి వెండి హారం, గంధ ప్రకాష్, చవ్వాకుల రమేష్, వేపకాయల శ్రీను అమ్మవారికి రూ.50 వేల విలువైన వెండి వడ్డాణం సమర్పించారు. ఆలయ



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

అర్చకుడు కుమార స్వామి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆర్‌డీగా సుజాత



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సుజాత

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్‌గా డాక్టర్ బి.సుజాత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈమె వైద్య ఆరోగ్యశాఖలో రీజినల్ ట్రైనింగ్ సెంటర్ (ఫిమెల్) ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ప్రాంతీయ డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ ఎస్.ఉమా సుందరి మంగళవారం పదవీ విరమణ చేశారు. దీంతో ఆ పోస్టులో డాక్టర్ బి.సుజాతను ఇన్‌చార్జి ఆర్‌డీగా నియమించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి జిల్లాల పరిధిలో ఈమె సేవలందించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాతను పలువురు అభినందించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కలెక్టర్ సుమిత్‌కుమార్



హుకుంపేటలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కలెక్టర్ సుమిత్‌కుమార్

హుకుంపేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్-టీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఏడవ వార్షికోత్సవం, ఎస్టీ కమిషనర్ సభ్యురాలు జంపరంగి లిల్లీ పుట్టి నరోజు పురస్కరించి ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అనేక మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, అత్యవసర సమయాల్లో రక్తం దొరక్క ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితులను అధిగమించాలంటే ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాదాతలు కావాలన్నారు. గిరిజన ప్రాంతంలో సేవలందిస్తున్న ట్రస్టు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్, ఎంపీడీవో, జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షుడు దిలీప్‌కుమార్, నాయకులు చెట్టి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు, ఎంపీపీ కూడా రాజుబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పీహెచ్‌సీ, మండల పరిషత్ కార్యాలయాల సందర్శన

దుంబ్రిగుడ: స్థానిక పీహెచ్‌సీ, మండల పరిషత్ కార్యాలయాలను మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. రోగుల వైద్యసేవలపై ఆరా తీశారు. వారితో మాట్లాడారు. రూ.10 లక్షలతో మరమ్మతులు చేపట్టిన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. అభివృద్ధి పనులపై ఎంపీడీవో ఉషారాణికి సూచనలిచ్చారు.

ఉచిత సివిల్స్ శిక్షణకు 65 మంది ఎంపిక

ఫలితాలను వెల్లడించిన ఐటీడీఏ పీవో అభిషేక్



ఎంపిక ఫలితాలను విడుదల చేస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రాజెక్టు లక్ష్య పేరుతో నిర్వహించనున్న ఉచిత సివిల్స్ శిక్షణకు 65 మంది గిరిజన విద్యార్థులు ఎంపికయ్యారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ వెల్లడించారు. మంగళవారం ఆయన ఉచిత సివిల్స్ శిక్షణకు ఎంపికైన విద్యార్థుల వివరాలను వెల్లడించారు. మొదటి, రెండు దశల్లో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షల అనంతరం 156 మందిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశామన్నారు. వీరికి ఈనెల 29, 30 తేదీల్లో ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 65 మంది ఎంపికయ్యారన్నారు. వీరికి విశాఖపట్నంలోని వేపగుంట వద్ద ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం నుంచి ఉచిత సివిల్స్ శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ. కొండలరావు, ఏటీడబ్ల్యూవో రజని పాల్గొన్నారు.

బొర్రాకు పర్యాటకుల తాకిడి

- దసరా సెలవుల్లో 48,066 మంది సందర్శన
- రూ.37,26,880 ఆదాయం



బొర్రా గుహల వద్ద పర్యాటకుల సందడి

తేది	సందర్శకులు	ఆదాయం (రూ.)
20	4405	33,7920
21	6030	46,3600
22	7582	58,7400
23	7405	57,3460
24	5475	42,5920
25	5103	39,6780
26	4351	33,9900
27	3963	30,8400
28	3752	29,3500

అనంతగిరి: పర్యాటక సీజన్ ప్రారంభం కావడంతో మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాడి ముందుగానే పర్యాటకుల రాక మొదలైంది. దసరా సెలవుల్లో బొర్రా గుహలను 48,066 మంది సందర్శించారు. రూ.37,26,880 లక్షల మేర ఆదాయం సమకూరింది. గతేడాది కన్నా ఈ ఏడాది ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని బొర్రా గుహల అధికారులు అంచనా వేస్తున్నారు.

వీఆర్‌పురం తహసీల్దార్ శ్రీధర్‌కు పదోన్నతి

- డిప్యూటీ కలెక్టర్‌గా స్థాయి పెంపు



విశాఖపట్నం: అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్‌పురం తహసీల్దార్ ఎస్.శ్రీధర్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. తాత్కాలిక, హడ్ హాక్ పద్ధతిలో రాష్ట్రంలో 39 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లగా పదోన్నతులు కల్పిస్తూ రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీధర్‌కు పదోన్నతి లభించింది.

డెంగ్యూ లక్షణాలతో వ్యక్తి మృతి

రాజవొమ్మంగి: మండలంలోని వట్టిగెడ్డలో గృహసారథిగా పనిచేస్తున్న రొంగల శ్రీనివాసరావు (30) టైఫాయిడ్, డెంగ్యూ లక్షణాలతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జ్వరంతో బాధపడుతున్న శ్రీనివాసరావును మూడు రోజుల క్రితం కాకినాడలోని జీజీహెచ్‌లో చేర్పించారు. ఈ నేపథ్యంలో అతని ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోవడంతో ఆరోగ్యపరిస్థితి క్షీణించడంతో మృతి చెందాడు. మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. అందివచ్చిన కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ఆహ్లాదం.. ఆదాయం



పర్యాటకులను ఆకట్టుకునేలా పొద్దుతిరుగుడు తోటలో ఏర్పాటుచేసిన గొడుగులు

- పర్యాటకులను ఆకర్షించేలా క్షేత్రాలు
- ఫొటోలకు రూ.20 వరకు వసూలు
- గిరి రైతు వినూత్న ఆలోచన

డుంబ్రిగుడ: మన్యంలో పర్యాటకం కొత్త పుంతలు తొక్కుతోంది. ఇక్కడికి వచ్చే పర్యాటకులను ఆకర్షిస్తూ వారి నుంచి ఆదాయం పొందేలా క్షేత్రాలను కొంతమంది రైతులు తీర్చిదిద్దుతున్నారు. దీనిలో భాగంగానే మండలంలోని వంతలిచింత గ్రామానికి చెందిన వంతల రాంబాబు అనే గిరిజన రైతు అరకు–పాడేరు ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న రెండు సెంట్లలో పొద్దుతిరుగుడు సాగు చేపట్టాడు. ప్రస్తుతం పూత దశకు చేరుకుంది. ఇక్కడికి వచ్చే పర్యాటకులు ఈ క్షేత్రంతో ఫొటోలు తీసుకునేందుకు వారి నుంచి రూ.10 నుంచి రూ.20 వసూలు చేస్తూ ఆదాయం పొందుతున్నాడు. గతేడాది రూ.70 వేలు ఆదాయం వచ్చిందని రైతు తెలిపాడు.

జగనన్న ఆరోగ్య సురక్షతోనే అందరికీ రక్ష


వైద్య శిబిరానికి వచ్చిన వృద్ధురాలి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుంటున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష అందరికి రక్షగా నిలుస్తోందని, ఏ రాష్ట్రంలో అమలు కాని పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సాగర పంచాయతీ కిల్లోగుడ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యమైతే తక్షణమే సమీపంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారుచేసిన రాగి వంటకాలను రుచి చూసేందుకు ఎమ్మెల్యేకు అందజేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ, వైస్ ఎంపీపీ లలిత, అరకు వైస్ ఎంపీపీ రామన్న, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గణపతి, నాయకులు లీలారాణి, మోహన్‌రావు, సింహాచలం, బీసీ, సెల్ లీగల్ జిల్లా అధ్యక్షుడు మురళీపట్నాయక్, సర్పంచ్ తౌడమ్మ, ఎంపీడీవో ఉషారాణి పాల్గొన్నారు.

కొత్త ఫ్లైట్లు వస్తున్నాయ్



స్పైస్ జెట్
నడపనున్న విమానాల సంఖ్య : 5
ఎప్పటి నుంచి : జనవరి
ఎక్కడెక్కడకు...: హైదరాబాద్, కోలకతా,జార్సిగుడలకు డైలీ చెన్నై, బెంగళూరుకు వారంలో మూడు,నాలుగు రోజులు

ఇండిగో
నడపనున్న విమానాలు : 2
ఎప్పటి నుంచి : నవంబరు 15 నుంచి కోల్‌కతాకు, 16 నుంచి బెంగళూరుకు..
ఎక్కడెక్కడకు...: కోల్‌కతా, బెంగుళూరులకు డైలీ సర్వీస్

- వీటిలో స్పైస్ జెట్ 5, ఇండిగో 2 విమాన సర్వీసులు
- చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతాలకు నడిపే వీలు
- త్వరలో శ్రీలంక సర్వీసు కూడా పునరుద్ధరణ
- విశాఖ విమానాశ్రయానికి పెరుగుతున్న ప్రయాణికుల తాకిడి
- కోవిడ్ పూర్వ స్థితికి చేరుకుంటున్న రద్దీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖకు కొత్త విమాన సర్వీసులు రానున్నాయి. ఒకవైపు ప్రయాణికుల రద్దీ అధికమవుతుండడం, మరోవైపు పరిపాలనా రాజధాని కానుండడంతో విమానయాన సంస్థలు విశాఖ వైపు ఆసక్తి చూపుతున్నాయి. విశాఖపట్నానికి స్పైస్ జెట్ ఐదు, ఇండిగో సంస్థ రెండు విమాన సర్వీసులు నడపడానికి అనుమతులు తెచ్చుకున్నాయి. ఈ విమానాలు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతాలతో పాటు ఒడిశాలోని జార్సిగుడ ఎయిర్‌పోర్టుకు కూడా నడపడానికి సంబంధిత సంస్థలు ప్రణాళికలు రూపొందించుకున్నాయి. వీటిలో స్పైస్ జెట్ హైదరాబాద్, కోల్‌కతా, జార్సిగుడలకు డైలీ, చెన్నై, బెంగళూరులకు వారంలో మూడు, నాలుగు రోజులు చొప్పున నడపనుంది. అలాగే ఇండిగో సంస్థ కోల్‌కతా, బెంగళూరులకు రోజూ తమ విమానాలను నడపాలని నిర్ణయించింది. స్పైస్ జెట్ సంస్థ జనవరి నుంచి విశాఖకు తమ సర్వీసులను నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇండిగో సంస్థ నవంబరు 15 నుంచి కోల్‌కతాకు, 16 నుంచి బెంగళూరుకు నడపనుంది. కోల్‌కతా సర్వీసు సాయంత్రం 6.55 గంటలకు, బెంగళూరు సర్వీసు ఉదయం 10.30 గంటలకు బయలుదేరనుంది. కాగా ఈ ఎయిర్‌పోర్టుకు ప్రయాణికుల రద్దీ కోవిడ్‌కు ముందు పరిస్థితికి చేరుకుంటోంది. కోవిడ్‌కు ముందు ఏటా 2.85 మిలియన్ల ప్రయాణికులు రాకపోకలు సాగించే వారు. ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్యకు దానికి చేరువలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరుకు అది 3 మిలియన్లకు చేరుతుందని ఎయిర్‌పోర్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

తొలిసారిగా జార్సిగుడకు..

ఇప్పటివరకు విశాఖపట్నం నుంచి ఒడిశాలోని జార్సిగుడకు విమాన సర్వీసులు లేవు. తొలిసారిగా స్పైస్ జెట్ సంస్థ పారిశ్రామిక ప్రాంతమైన జార్సిగుడకు విమాన సర్వీసును నడపాలన్న నిర్ణయం తీసుకుంది. విశాఖ-జార్సిగుడల మధ్య ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉందన్న అంచనాతో స్పైస్ జెట్ తమ విమానాన్ని నడపడానికి ముందుకొచ్చింది.

శ్రీలంక సర్వీసు పునరుద్ధరణ

మరోవైపు శ్రీలంక-విశాఖల మధ్య నిలిచిపోయిన విమాన సర్వీసు మళ్లీ పునరుద్ధరణ కానుంది. 2017లో కొలంబో-విశాఖ మధ్య శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ తమ విమాన సర్వీసును ప్రారంభించింది. అయితే కోవిడ్ సమయంలో ఈ సర్వీసు రద్దు అయింది. త్వరలోనే ఆ విమాన సర్వీసును పునరుద్ధరించనున్నట్టు ఎయిర్‌పోర్టు వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్‌కు ఒకే ఒక్క అంతర్జాతీయ విమాన సర్వీసు నడుస్తోంది. గతంలో బ్యాంకాక్, దుబాయ్‌లకు కూడా ఇక్కడ నుంచి నడిచేవి. త్వరలో కొలంబో సర్వీసును కూడా పునరుద్ధరిస్తే ఈ ఎయిర్‌పోర్టు నుంచి రెండు అంతర్జాతీయ సర్వీసులు నడిచినట్టవుతుంది.

విమానయాన సంస్థలకు లేఖలు



విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన అన్ని సదుపాయాలున్నాయి. 24 గంటలూ విమానాల రాకపోకలకు అనువైన ఏర్పాట్లున్నాయి. 16 పార్కింగ్ స్టాండ్లు, 3.33 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టెర్మినల్ బిల్డింగ్, 30 చెక్ ఇన్ కౌంటర్లు, మూడు పాసింజర్ బోర్డింగు బ్రిడ్జిలు, 36 ఇమిగ్రేషన్, కస్టమ్స్ కౌంటర్లు ఉన్నాయి. ఏటా ఈ విమానాశ్రయం 3.5 నుంచి 4 మిలియన్ల పాసింజర్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. పైగా సుందరమైన ఈ నగరానికి పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. స్టీల్‌ప్లాంట్, పోర్టులు, హెచ్‌పీసీఎల్, ఎస్‌సీజెడ్, తూర్పు నావికాదళం ప్రధాన కేంద్రం, ఫార్మా పరిశ్రమలు ఉన్నాయి. వాణిజ్యపరంగానూ ఎంతో అభివృద్ధి చెందుతోంది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని విశాఖకు విమాన సర్వీసులను విస్తృతం చేయాలంటూ దేశీయ, అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్‌లకు ఇటీవలే లేఖలు రాశా. ఆయా సంస్థల నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నా.
– ఎస్.రాజారెడ్డి, డైరెక్టర్, విశాఖ ఎయిర్‌పోర్టు

5 నుంచి స్కూల్ ర్యాంకింగ్ చెస్ టోర్నీ

సీతమ్మధార: రాష్ట్ర చెస్ అసోసియేషన్, జిల్లా చెస్ అసోసియేషన్, ఆదిత్య చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 5వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి స్కూల్స్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్-2023 నిర్వహిస్తున్నట్లు ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణారావు, కార్యదర్శి ఎస్.మణికంఠరావు తెలిపారు. బ్రోచర్‌ను సీతమ్మధారలో మంగళవారం సిల్వర్ ఓక్స్ స్కూల్ ప్రిన్సిపాల్ వై.సునీత, స్కూల్ డైరెక్టర్ పి.శ్రీనివాస్, చెస్ ప్రతినిధులు ఆవిష్కరించారు. రుషికొండలోని సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో జరిగే ఈ పోటీల్లో 250 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 96766 36661ను సంప్రదించాలని కోరారు.

పరిశ్రమలకు వెన్నెముకగా ప్రభుత్వం

అక్కిరెడ్డిపాలెం: పరిశ్రమలకు వెన్నెముకగా ప్రభుత్వం నిలుస్తోందని ఏపీ ఇండస్ట్రీస్ కమిషనర్ సీహెచ్.రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీయలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) భవనంలో పారిశ్రామిక వేత్తలు, వాసీవా, ఐలా, ఫ్యాప్సీ ప్రతినిధులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వారికి పూర్తి సహాయసహకారాలు అందిస్తోందన్నారు. కరోనా తర్వాత తీవ్ర సంక్షోభం ఎదుర్కొన్న పరిశ్రమలకు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. ఫ్యాప్సీ, వాసీవా సంయుక్తంగా ఎంఎస్‌ఎంఈలకు సహకరించాలని తెలిపారు. ఐలా ఎదుర్కొంటున్న సమస్యలను, రావల్సిన గ్రాంట్లను రాజేశ్వర్ రెడ్డి దృష్టి ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి తీసుకువచ్చారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ వాసీవా ఆవిర్భాం నుంచి ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సీహెచ్.గణపతి మాట్లాడుతూ జిల్లాలో ఆటోనగర్ వాసీవాకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అనంతరం ఇండస్ట్రియల్ కమిషనర్‌ను వాసీవా అధ్యక్షుడు పాండురంగ ప్రసాద్ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్సీ అధ్యక్షుడు మురళీ కృష్ణ, ఐలా కమిషనర్ జయచంద్ర, ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, వాసీవా కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారి పర్వారి ప్రభాకర్, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.


వాసీవాలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఇండస్ట్రీస్ కమిషనర్ రాజేశ్వర్ రెడ్డి

జాతీయ సమైక్యత అందరి బాధ్యత

చింతూరు: జాతీయ సమైక్యతను కాపాడడం అందరి బాధ్యతని దీనికోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. జాతీయ ఐక్యతా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన 3కే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఐక్యతగా మెలగాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులు, ఉద్యోగులతో జాతీయ ఐక్యతా దినోత్సవం ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ కారం కన్నారావు, సీఐ అప్పలనాయుడు, ఏవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేవీలో మహిళలకు ఉద్యోగావకాశాలు


విద్యార్థినులతో నౌకాదళ అధికారి సజీవకుమార్

భీమునిపట్నం: భారత నౌకాదళంలో మహిళలకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని నౌకాదళ అధికారి సజీవకుమార్ అన్నారు. మంగళవారం కేజీబీవీ వద్ద విద్యార్థులను కలిసి మాట్లాడారు. సరైన ప్రణాళికతో చదువుకుంటే ఇందులో అవకాశాలను పొందవచ్చన్నారు. సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ అవకాశాలను కల్పిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు, మరికొన్ని రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: విజయనగరం జిల్లా కంటకాపల్లి-అలమండ మధ్య జరిగిన ప్రమాదం కారణంగా పలు రైళ్లు రద్దు చేశారు. మరికొన్ని రీ షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ముంబయి-భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్-చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్, సంత్రగచ్చి-చెన్నై సెంట్రల్ (22807) ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా-బెంగళూరు(22887) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, హౌరా-బెంగళూరు (12863) ఎక్స్‌ప్రెస్, షాలిమర్-వాస్కోడగామా (18047) అమరావతి ఎక్స్‌ప్రెస్, షాలిమర్-తిరువనంతపురం (22642) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు మంగళవారం రద్దయ్యాయి.

నేడు రద్దయిన రైళ్లు

వాస్కోడగామా-షాలిమర్ (18048) అమరావతి ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్-షాలిమర్ (12842) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-పలాస(08532) పాసింజర్ స్పెషల్, సికింద్రాబాద్-హౌరా (12704) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లను బుధవారం రద్దు చేశారు.

2న రద్దయిన రైళ్లు

భువనేశ్వర్-ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు- హౌరా (12864) ఎక్స్‌ప్రెస్, బెంగళూరు- హౌరా (22888) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హౌరా (22246) దురంతో ఎక్స్‌ప్రెస్, పలాస-విశాఖపట్నం (08531)పాసింజర్ స్పెషల్, హైదరాబాద్-షాలిమర్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 2వ తేదీన రద్దు చేశారు.

ఆలస్యంగా పలు రైళ్లు

ఆయా స్టేషన్లలో మంగళవారం బయలుదేరాల్సిన పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరాయి. అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు చేరుకుంటున్నాయి. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

- బెంగళూరులో మంగళవారం ఉదయం 8.50 గంటలకు బయలుదేరాల్సిన బెంగళూరు-హతియా (12836) ఎక్స్‌ప్రెస్ బుధవారం తెల్లవారు 3 గంటలకు బయలుదేరింది.
- బెంగళూరులో మంగళవారం మధ్యాహ్నం 11.20 గంటలకు బయలుదేరాల్సిన బెంగళూరు-హౌరా (12246) ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరింది.
- బెంగళూరులో మంగళవారం ఉదయం 10.15 గంటలకు బయలుదేరాల్సిన బెంగళూరు-అగర్తలా (12503) ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.40 గంటలకు బయల్దేరింది.
- బెంగళూరులో మంగళవారం ఉదయం 10.35 గంటలకు బయలుదేరాల్సిన బెంగళూరు-హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ రాత్రి 8 గంటలకు బయలుదేరింది.
- చెన్నై సెంట్రల్‌లో మంగళవారం ఉదయం 7 గంటలకు బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్-హౌరా(12842) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరింది.
- హౌరాలో మంగళవారం రాత్రి 11.55 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-చెన్నై సెంట్రల్ (12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్ బుధవారం తెల్లవారు 3 గంటలకు బయలుదేరింది.

దంతేవాడ వరకే కిరండూల్ పాసింజర్

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల దృష్ట్యా కొత్తవలస-కిరండూల్ లైన్‌లో నడిచే పాసింజర్ స్పెషల్ గమ్యం కుదించినట్లు డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ బుధవారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ బుధవారం నుంచి 6వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

ఆచార్యుల నియామక నోటిఫికేషన్ విడుదల

ఏయూక్యాంపస్: ఏయూలో ఆచార్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ జారీ చేశారు. వర్సిటీలో, ఆర్ట్స్-కామర్స్, సైన్స్-టెక్నాలజీ, లా, ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలల పరిధిలో 523 ఉద్యోగాల భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన నోటి ఫికేషన్ మంగళవారం జారీ చేశారు. ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో భాగంగా 85 ప్రొఫెసర్, 139 అసోసియేట్ ప్రొఫెసర్, 299 అసిస్టెంట్ ప్రొఫె సర్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. వీటిలో 509 ఉద్యోగాలు రెగ్యులర్‌వి కాగా, 14 ఉద్యోగాలు బ్యాక్ లాగ్. పూర్తివివరాలు కోసం ఏయూ వెబ్‌సైట్‌ని సంప్రదించాలని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సూచించారు.

టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు దరఖాస్తు చేసుకోవాలి


ఆన్‌లైన్ సదస్సులో పాల్గొన్న రెక్టార్ సమత

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల అధ్యాపకులు రెండు వారాల మాలవీయ మిషన్ టీచర్ ట్రెనింగ్ ప్రోగ్రాంకు దరఖాస్తు చేసుకోవాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. యూజీసీ చైర్మన్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. అనంతరం సదస్సు వివరాలు ఆమె వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 111 కేంద్రాలలో ఆన్‌లైన్ విధానంలో అధ్యాపకులకు రెండు వారాలపాటు శిక్షణ అందించనున్నామన్నారు. రాష్ట్రంలో మూడు కేంద్రాలలో ఈ శిక్షణ ఉంటుందని, వీటిలో ఒకటిగా ఏయూ నిలుస్తోందన్నారు. నవంబర్ నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు వర్సిటీ అనుబంధ కళాశాలల అధ్యాపకులు సత్వరం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. యూజీసీ సదస్సులో హెచ్‌ఆర్‌డీసీ సెంటర్ సంచాలకులు ఆచార్య టి.వి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు నలుగురి ఎంపిక

యలమంచిలి: జాతీయ స్థాయి ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీలకు యలమంచిలి పట్టణానికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు బి.భవాని , టి.శ్వేత, కె.రేణుకాశ్రీ, యు.జయశ్రీ నవంబర్ 6వ తేదీ నుంచి 9 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ఆంధ్రా యూనివర్సిటీ తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి అచ్చంనాయుడు, సీనియర్ అంతర్జాతీయ క్రీడాకారులు దొరబాబు, సత్యవతి, పలువురు తైక్వాండో క్రీడాకారులు అభినందించారు.

పాయకరావుపేట: ఈ నెల 21న ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన తైక్వాండో అండర్ -62 వెయిట్ కేటగిరిలో జరిగిన పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యాంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని తుంపాల శ్వేత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సౌత్ జోన్ పోటీలకు ఎంపికైంది. ఈ విద్యార్థిని నవంబర్ 5 నుండి 9 వరకు రాజస్థాన్‌లో శ్రీ జేజేటి యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటుందని ప్రిన్సిపాల్ డా.కె.వీర్రాజు తెలిపారు. ఆ విద్యార్థినిని విద్యా సంస్థల ప్రతినిధులు నరసింహారావు, ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.